


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మా బామ్మ పెట్టె

చిన్నతనంలో ప్రతి ఇంట్లో భోషాణాలుండేవి. కావిడి పెట్టెలుండేవి. అలాంటిదే చిన్న సైజుది మా బామ్మకీ ఓ పెట్టె ఉండేది. చిన్నప్పటి నుండీ ఆ పెట్టె అంటే మహా క్రేజు. గారడీ వాడి మంత్రపు సంచిలా ఆవిడ అది తీసినప్పుడల్లా అందులో నుండి వింత వింత వస్తువులు తీసి మాకు ఇస్తుండేది.

ఎప్పుడైనా శలవులకి మేం మా నాన్నతో బాబాయిగారింటికి వెళ్ళేవాళ్ళం. మా బామ్మ మంచం క్రిందే ఈ పెట్టె ఉండేది. ఆవిడ మా బాబాయి ఆఫీసుకి వెళ్ళేదాకా ఓపిక పట్టి, ఆయన వెళ్ళిపోయాక మమ్మల్ని దగ్గరకి పిలిచి అందులోనుండి చిన్న చిన్న పొట్లాలు తీసి ఇస్తుండేది. ఆ పొట్లం మీద నా పేరుంటే అది నాకోసం ఆవిడ దాచి వుంచిన వస్తువు అన్నమాట.

"ఇది బాబు బావ పెళ్ళిలోది... తీసుకో నీ కోసం తెచ్చాను" అని ఓ స్టీలు పళ్ళెమో, చెవి రింగులో, పూసల దండో ఏదో ఒకటి ఇస్తుండేది. అవి ఇచ్చినప్పుడు బాగానే ఉండేది. కానీ ఆవిడ ఏ మిఠాయి ఉండో, చేగోడీలు ఇచ్చినప్పుడు మా బాబాయి ఆ దరిదాపుల్లో ఉంటే "తినకండే.. కలరా వచ్చి చచ్చిపోతారు. అవి రెండు నెలల క్రిందట మేం రాజమండ్రి పెళ్ళికి వెళ్ళినప్పుడు తెచ్చిన మిఠాయిలు," అని గావుకేకలు పెట్టేవాడు. ఆవిడ మొహం గంటు పెట్టుకునేది.

నిజానికి మాకూ భయంగానే ఉండేది. ఆవిడ ఎవరింటికి వెళ్ళినా పెద్దావిడ కదా అని వాళ్ళు ఏ పండో, పలహారమో చేతిలో పెడితే ఒద్దు అనేది కాదు! తీసుకొచ్చి పెట్టెలో పెడుతూ, ఎవరికివ్వాలో చీటీ కూడా రాసుకునేది. ఆవిడకి ఇంకో తమాషా హాబీ ఉండేది. పేపర్లో ప్రముఖుల ఫోటోలు పడితే కట్టింగ్‌లు చేసి అవి ఓ నోట్ బుక్‌లో అతికించేది. అందులో ఇందిరాగాంధీ పర్యటన, సత్యసాయిబాబా జన్మదినం, సి.నారాయణరెడ్డిగారి సన్మానం, ఉస్మానియా వి.సీ బదిలీ... ఇలాంటి అనేక వార్తలుండేవి. ఓ సారి ఆవిడలేనప్పుడు పెట్టెలో నుండి బారులు దీరి చీమలు , మేట్నీ వదిలితే బయటకొచ్చే ప్రేక్షకుల్లా మహదానందంగా బయటకి వస్తున్నాయి. మా బాబాయి శలవు అని ఇంట్లో ఉన్నాడు. "అమ్మ లేదు ఇదే అదను" అని పెట్టె తీసి చూసాడు. అందులో చీమలు పట్టిన ఓ దోశముక్క కనిపించింది. మా పిన్ని ఇచ్చినప్పుడు ఆకలి లేక అందులో దాచిందన్నమాట. ఆయన విసుక్కుంటూ అది తీసి పడేసి పెట్టె దులుపుతుంటే, ఆవిడ నోట్ బుక్‌లో ఎవరో ఒక రచయిత, పెద్దగా పేరూ, ఊరూ లేని అతని చిన్నప్పటి ఫోటో కనిపించింది. అది

అతని చిన్నప్పటి ఫోటో అనడానికి గుర్తుగా 'అప్పారావు బాల్యం' అన్న హెడ్డింగు ఆ ఫోటో మీద అతికించి ఉంది. మా బాబాయికి ఒళ్ళుమండిపోయింది. "ఎప్పుడైనా నా చిన్నప్పటి ఫోటో ఇంత భద్రంగా దాచావా? ఈ అప్పారావు ఎవరే?" అని ఆవిడ ఇంటికి రాగానే కేకలు వేసాడు. ఆయన తను ఇంట్లో లేనప్పుడు తన పెట్టె తీసినందుకు ఆవిడ తెగ అవమానపడింది. రిక్షా పిలిపించుకుని ఇంకో బాబాయి ఇంటికి పెట్టెతో సహా వెళ్ళిపోయింది.

కానీ వెళ్ళినావిడ వెంటనే తిరిగొచ్చేది. మా రెండో పిన్ని దగ్గర తప్ప ఎవరి దగ్గరా ఉండలేకపోయేది. మా బాబాయి ఆవిడ "ఫస్ట్ దాటాకా వస్తానురా" అని ఎప్పుడైనా అంటే "ఏం అక్కడంతా అప్పులు చేసేసావా?" అని కేకలు వేసేవాడు

ఆవిడ దగ్గర ఓ గొప్పకళ ఉండేది. ఎవరి శ్రీమంతాలు అయినా, బారసాలలు అయినా, పెళ్ళి అయినా, పుట్టినరోజైనా పంచరత్నాలు చదివించుకునేది! అంటే ఐదు పేజీల కవిత్వం.

బహు చక్కని ముఖం చంద్రబింబం పోలు

మిగుల చక్కని ముగ్గు సన్నజాజిని పోలు...

సుగుణాల రానమ్మ మా లక్ష్మి చందనపు బొమ్మ

... ఇలా సాగుతుండేవి ఆ పద్యాలు. ఇవి కాపీలుగా రాసి పెట్టుకుని, ఒక్కోసారి 'లక్ష్మి' అన్న చోట 'పద్మ' అనీ 'రమణి' అనీ మార్చి చదివేస్తుండేది. మా బాబాయి ఆవిడకి ప్రథం విమర్శకుడు,

"లక్ష్మికి కోటేరు ముక్కేదే? పద్మకి అంత శ్రావ్యమైన గొంతేదే?" అని సాధిస్తుండేవాడు. కానీ ఆవిడ ఏమీ పట్టించుకోకుండా పంచరత్నాలు అనర్గళంగా రాసి చదువుతూనే ఉండేది. ఆవిడకి ముచ్చటలు ఎక్కువ. మునిమనవడు పుట్టగానే, ఉయ్యాలలో కూర్చో పెట్టి మనవలు తులాభారం చేసి నెత్తిన రుపాయి కాసులు పోసారు. ఏ ముచ్చటా వదిలిపెట్టేది కాదు.

ఒకనాడు ఆవిడ 'గీత' సినిమాకి పక్కింటి బామ్మగారినీ, ఎదురింటి అమ్మమ్మగారినీ తీసుకుని వెళ్ళిపోయింది. ఆవిడ ఉద్దేశం అది భగవద్గీత అని. వెళ్ళినకాసేపటికి ఆ దృశ్యాలు భరించలేక వాళ్ళు "ఇదేమిటి బామ్మగారూ.. వెళ్ళిపోదాం రండి" అంటే "ఇవన్నీ మనకి తెలీనివా?" అంటూ మొత్తం చూసే వచ్చింది. ఇంకోనాడు మా బాబాయి పిన్నితో జంటగా సినిమాకి వెళ్ళడానికి సరదాపడ్డాడు. "మా ఫ్రెండ్ భార్యకి ఒంట్లో బాలేదు, చూసొస్తాం" అని అబద్ధం చెప్పాడు.

మా పిన్ని కలవారి కోడలూ కలికి కామాక్షి టైపు, అత్తగారికి దిబ్బరొట్టె కాల్చి, పిల్లలకి వంట చేసి, రాత్రి పాలకి వాకిట్లో గిన్నె పెట్టి, మర్నాటి పాచి అప్పుడే చేసేసి, ముగ్గు పెట్టేసి, అంట్లు కడిగి, స్టౌ కడిగి, వంటిల్లు బట్టపెట్టి తుడిచి ఫస్టు షోకి వెళ్ళింది. ఇవన్నీ ఎప్పుడు చేస్తారో తెలియనంతటి అమాయకురాలు కాదు మా బామ్మ!

మా బాబాయీ, పిన్నీ ఆలుమగలు సినిమా కింద క్లాసులో కూర్చుని చూసి, ఇంటర్వెల్‌లో పాప్‌కార్న్, సోడాతో సరిపెట్టి బయటకొస్తుంటే ఎవరో మా బాబాయి కొలీగ్ "అదేవిటి భాస్కర్‌గారూ మీ అమ్మగారిని అలా ఒక్కరినీ వదిలిపెట్టేసారూ? అన్నారట. మా బాబాయి వెనక్కి తిరిగి చూస్తే, పై క్లాసు డోర్ వైపు తడుముకుంటూ, కళ్ళద్దాలు సరిజేసుకుంటూ మా బామ్మ వెళుతోంది. ఆవిడ ఇంటర్వెల్‌లో హాయిగా సమోసాలు తిని కూల్ డ్రింక్ తాగి, వీళ్ళ వ్యవహారం అంతా చూస్తోందన్నమాట "అదేవిట్రా ఛీప్‌గా సోడా తాగడం? గోల్డ్‌స్పాట్ తాగకుండా?" అని చిరాకు పడిందికూడానూ. కొడుకూ కోడలూ తనని సినిమాకి తీసుకెళ్ళకుండా వెళ్ళడం ఆవిడకి ఇష్టం లేని విషయాల్లో అతి ముఖ్యమైనది.

ఆవిడకున్న కళల్లో ఇంకో ముఖ్యమైనది అక్షరాలు తిరగేసి ఉత్తరాలు రాయడం. అవి అద్దం ముందు పెట్టుకుంటే తప్ప కనిపించవు. మాకు అప్పుడప్పుడూ అలా రాసి పంపిస్తుండేది. ఇంక మేం స్కూల్ టైం అయిపోతున్నా అద్దం ముందు ఈ కాయితం పెట్టుకుని తెగ కుస్తీ పట్టేవాళ్ళం. మా అమ్మ కేకలు వేసేది.

ఆవిడ కుసుమ హరనాధ భక్తురాలు. ఆయనకి సిగరెట్లు కూడా నైవేద్యం పెట్టేది. అదేమిటి బామ్మా అంటే "ఆయన స్టేషన్ మాస్టర్‌గా పని చేసినప్పుడు తాగేవారే, భక్తులు మనసు తెలుసుకుని కోరిక తీర్చకపోతే ఇంకెవరు తీరుస్తారు?" అనేది.

ఆవిడ ఏనాడూ ఉపవాసం చెయ్యగా మేం చూడలేదు! చీర నలగకుండా, సిగ చెదరకుండా విక్టోరియా మహారాణిలా కళ్ళద్దాలు సవరించుకుంటూ కూర్చుని ఉండేది. వంట ఇంట్లోకి వెళ్ళడం ఆవిడ పిల్లలు కూడా చూడలేదట. పెళ్ళయ్యే నాటికి అమ్మమ్మని కూడా తెచ్చుకుందట! ఆ ముసలమ్మ వండిపెట్టేదట. తరువాత మా అత్తయ్యలు ఎదిగొచ్చారు. వాళ్ళకి పెళ్ళయ్యేనాటికి కోడళ్ళు వచ్చారు. మొత్తానికి ఆవిడకి వంట చేసే అవసరం ఎన్నడూ కలగనట్టి భాగ్యజీవి. ఆవిడ వంట తినే అదృష్టం కలగనట్టి ధన్య జీవులం మేము.

మా బామ్మ పెట్టెలో హరప్పా మొహంజదారో తవ్వకాల్లో బయట పడినట్టు కలాలూ, అట్టల్లేని వార పత్రికలూ, పిప్పరమెంటు బిళ్ళలూ, నల్లపూసలూ, పాలపీకలుతోపాటు అందరి పెళ్ళి శుభలేఖలూ, జన్మతేదీలూ కూడా దాచి పెట్టేది. ఎప్పుడైనా మనం ఎవరి పెళ్ళిరోజైనా, పుట్టిన రోజైనా మరచిపోతే ఆవిడ పెట్టలో వెదికితే తారీఖులు దొరికేవి. ఆవిడ  ఆ పెట్టె మోసుకుంటూ ఓ ఇంటి నుండి ఓ ఇంటికి వేల వేల జ్ఞాపకాలని తరలించుకు వెళ్ళేది. నేను రచయిత్రినయితే ఆవిడ పోలికే వచ్చిందని  తెగ మురిసిపోయేది!

ఆవిడ చాలా అభిమానవతి. సిగ్గు ఎక్కువ. దానికి తార్కాణం, ఆవిడ కోరిన చివరి కోరిక!

"ఒరేయ్... నేను చచ్చిపోయాక నా శవానికి బాత్రూంలో స్నానం చేయించండి... అందరి ముందూ, వాకిట్లో ఒద్దు.. నాకు సిగ్గు" అంది.

ఆవిడ చివరి కోరిక మన్నించి అలాగే చేయించారు. మనం బతికున్నప్పుడు తీర్చకపోయినా, చాలాసార్లు వాళ్ళు పోయినప్పుడు కోరికలు తీరుస్తాం. తిరిగిరాని లోకాలకి తరలి వెళ్ళిన వాళ్ళకి, "ఉంటే అవి చేసేవాళ్ళం, ఇవి చేసేవాళ్ళం" అనుకుంటాం.

పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు.... ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు....

